# తేనెపట్టు

ఆశకు తెరచుకోవడం, నిరాశకు ముడుచుకోవడం తెలియని నా చిన్న వయసులో ఒక వ్యక్తి పడ్డ శ్రమ, ఈ నాటికీ నా కళ్ళకు కట్టుంది. ఎందుకూ పనికి రాదనుకున్న ఐదు ఎకరాల ఇసుకపర్రను, పళ్ళతోటగా మార్చడానికి అప్పయ్య పడ్డ శ్రమ అది.

అంత శ్రమ పడ్డ అప్పయ్య, ఆ ఫలం అనుభవించకుండానే పోయాడు. ఒకసారి మా వూరు వెళ్ళేటప్పుడు నాతో ఆ పల్లెటూరి బడిలో చదువుకున్న అప్పయ్య కొడుకు హరి 'అప్పయ్య తోట'గా పేరు పొందిన ఆ తోటలోనికి తీసుకవెళ్ళాడు. రకరకాల పళ్ళున్నా, వాడు రుచి చూపించిన వాటిలో నాకు తినగా తృప్తి నిచ్చినది ఆ సపోటా పళ్ళే.

ఆ తరువాత బ్రహ్మచారిగా నాకు నచ్చిన, నేను మెచ్చిన సుకన్యను, మనసులో 'సపోటా పండు' అని సంభోదించుకునేవాడిని.

ఉద్యోగరీత్యా దేశంలో తిరిగి, కాశ్మీరు యేపిలు పళ్ళు, కాశీ రేగుపళ్ళు, గోవా మంకూరాలు, ఉత్తరప్రదేశ్ దసరీలు, ఆర్గన్ ద్రాక్ష, నాగపూర్ సంత్రాలు, ఔరంగాబాద్ జాములు, రాజమండ్రి సీతాఫలాలు, బెంగుళూరు దానిమ్మలు, మైసూరు బొప్పాయిలు, హైదరాబాద్ చుక్కల అరటిపళ్ళు, సింహాచలం అనాస పనసలు, అలమండ బంగినపళ్ళు, ఉద్దానం తేనెపనస - ఇలా ఎన్ని అపురూపమైన పళ్ళు తిన్నా, ఏంటో ఆ తొలి 'సపోటా' మోజుతో దానికి మించిన రుచిగల పండు ఇంకొకటి లేదని తేల్చుకున్నాను. యౌవనంలో ఆ సపోటా పండు తిన్నా వయసు మళ్ళినా కూడా ఇంకా ఆ రుచి నా నోటిలో నిత్యం వుండిపోయింది.

ఉద్యోగంలో వున్నప్పుడు, నిత్యం వెతుక్కునే జీవితం, రిటైరయ్యాక, నాలుగు రాళ్ళు చేతపడ్డాక లేని సిరి వెతుక్కుని వచ్చినట్లైంది. ఇన్నాళ్ళూ తెరచుకుని వుంచిన ఈ ఆశకు ఒక రూపకల్పన చేద్దామని మా వూరు వెళ్ళాను. నాకు కావలసింది ఒక్క ఎకరం జాగా. ఆ మధ్య చిన్న ఇల్లు కట్టుకుని, ఉన్న శక్తితో అప్పయ్యలా చెమట కార్చి సపోటా పళ్ళు పండించి తిందామని. మావూరు ఎన్నేళ్ళ తరువాతో ఇప్పుడు వెళ్తే నా బాల్య మిత్రుడు హరి వున్నాడు. అప్పయ్య తోట లేదు. ఆ జాగాలో పొగ చిమ్ముతూ ఒక పేపరు మిల్లు బడబడ శబ్దం చేస్తోంది. "తోట ఏం అమ్మేశావు?" అడిగాను.

"పెద్ద ధర వచ్చింది. ఈ మిల్లు వల్ల వూరికి ఉపకారం కూడా జరుగుతోంది కదా! నా కొడుక్కి ఈ మిల్లులో ఉద్యోగం ఇచ్చారు" అన్నాడు హరి.

ఈ మిల్లు రావడం కాదుగానీ, ఎక్కడా అమ్మడానికి ఒక ఎకరం కాదు కదా, ఒక అర ఎకరం కూడా వూరి దగ్గరిలో దొరకలేదు. భూమి ధర విపరీతంగా పెరిగిపోయింది. నిరాశతో తిరిగి వచ్చాను.

పట్నం శివార్లలో వున్న వేపగుంట గ్రామం దగ్గర రోడ్డుకు దగ్గరలో ఓ ఆరు వందల గజాల జాగా దొరికింది. ఈశాన్య వైపు తవ్విన బావిలో మంచినీరు పడింది. చిన్న ఇంటికి పునాది వేస్తూనే, దక్షిణ వేపు రాళ్ళు రప్పలు యేరి, రకరకాల మొక్కలను వెయ్యడానికి గోతులు తవ్వించాను. వాటిలో గెత్తం నింపి, చెన్నంగి కొబ్బరి, జామి, సీతాఫలం, సువర్ణ రేకతోపాటు దక్షిణ గుమ్మానికి ఎదురుగా నాకు అన్నిటికన్నా ఇష్టమైన సపోటా మొక్కను నాటాను. దీనిని గోవాలోని మడగాం నర్సరీ నుంచి తెచ్చాను. నా మిత్రుడు డికొస్టా ఇంటికి వెళ్ళినప్పుడు వాడి దొడ్లో పండిన సపోటా పళ్ళు తినిపించగానే నాకీ అంటు కావాలని కోరాను. ఇద్దరం దగ్గరలో వున్న నర్సరీకి వెళ్ళి తెచ్చిన సపోటా మొక్క అది. నాటిన మూడేళ్ళకే కాపు మొదలిడినా, నాలుగో ఏటకు బలంగా చెట్టు పెరిగి, ఇంటికన్నా పొడుగ్గా ఎదిగిపోయింది.

పెరట దొడ్డిలో సపోటా చెట్టు చూసిన ఒక చుట్టం "అబ్బే అబ్బే, పాలు కారిన చెట్టు. ఇంట్లో వుండకూడదు" అన్నాడు. ఆ రాత్రే అతని భోజనం తరువాత మూడు సపోటా పళ్ళు వలిచి ఇచ్చాను. తింటూ "ఇందులో తేనె పోశావా?" అన్నాడు. "లేదు. మరి అలాంటి చెట్టును పీకేమంటావా?" అంటే అతను మాటాడలేదు. ఉడతలు కొరికెయ్యకుండా రోజూ పలకబారిన కాయలు తీయడానికి చూస్తుంటే ఒకరోజు ఆ పై రెమ్మకు ఒక తేనెపట్టు పెట్టడం చూశాను. ఈ తేనెపట్టు, ఈ సపోటా చెట్టుకు ఒక అలంకరణగా వుంది. ఒక రాణీ ఈగ నా చెట్టు పళ్ళ రుచికి మెచ్చి ఇచ్చిన షీల్డులా వుందా తేనెపట్టు. అమావాస్యకు కుదించి పౌర్ణమి సరికి తేనెతో నిండి కైవారంలో చేటంతగా మారిన ఈ పట్టువైపు చూస్తూ, ఎన్నెన్నో ఆలోచనలతో మనసును నింపుకునేవాడిని. ఆ రెమ్మకున్న సపోటాలు కోస్తే రెమ్మ కదలి వాటికి బాధ కలుగుతుందని, ఆ రెమ్మ ముట్టుకోలేదు. ఆ రెమ్మనించి పండి రాలిన సపోటాలు తేనెకన్నా మధురంగా వుండేవి.

పట్టుకు అంటిపెట్టుకుని వుండే తేనెటీగల గురించి కొత్త విషయాలు తెలుసుకున్నాను. వాటి పనితనానికి విస్తుపోయేవాడిని. అవి తగరాన్ని బంగారంగా మార్చగలిగే శక్తి గలవిగా తోచాయి. ఆ తేనెపట్టు యేభయి అంతస్తుల నివాస భవనం అనిపించింది. ఆ గదుల్లో అమృతం సృష్టించే అపూర్వ వ్యక్తులు నివసిస్తున్నారనుకునేవాడిని.

నాలో రేగిన వూహలను నాలోనే దాచుకుని ఆనందిస్తున్నాను. ఆ వూహలు నన్ను వుత్తేజితుని చేసే సమయంలో హైదరాబాద్ ఓ నాలుగు రోజులు ఒక సాహిత్య సమావేశానికి వెళ్ళాను. అటునించి తిరిగి రాగానే తేనెపట్టును చూడ్డానికి పెరటకు వెళ్ళాను. అక్కడ తేనెపట్టులేదు. ఏమైంది?

"ఐదు రూపాయలిచ్చి తియ్యించి పడేశాం" అంది మా ఆవిడ.

"నేను లేనప్పుడే ఆ పని ఎందుకు చేశావ్."

"చెయినులు బాబాయి వచ్చారు. ఈ తేనెపట్టును చూసి అయ్యో ఇది దక్షిణాన వుంది. అశుభం. వెంటనే తియ్యించాలన్నారు."

"అశుభం అశుభం" వెక్కిరించాను.

"ఇంటికి దక్షిణాన తేనెపట్టుపెడ్తే మరణం తప్పదట. నేను నమ్మకపోతే ఇదిగోండి మన ఇంట్లో వున్న పంచాంగమే తీసి చూపించారు." నేను పంచాంగమే చూడలేదు. అలా దిగాలుగా మాట్లాడకుండా కూర్చున్నాను. ఆ రాత్రి అన్నం సయించలేదు. ఆ తేనెపట్టును చూస్తూ నేను అల్లుకున్న అపురూపమైన వూహల్ని కనీసం మా అవిడపరం చేసినా బహుశః నేను వచ్చేవరకు ఈ తేనెపట్టును ముట్టకుండా వుండేదేమో?

ఆ రాత్రి నిద్దర పట్టలేదు. అల్లకల్లోలమైన మనసు నన్ను ఆలోచనల వూబిలో దించేసింది. అలా చీకటిలో చూస్తుండగానే నా కళ్ళ ఎదుట ఎవరో కదులుతున్నట్టు అనిపించింది. నిదానించి చూస్తే చూచాయగా అప్పయ్య కొడుకు హరి నిల్చున్నట్లు అనిపించింది.

"అప్పయ్య ఎంత చెమటోడ్చి ఆ చెట్లు పెంచాడో నేను కళ్ళారా చూశాను. నివ్వూ చూశావు. తోట నరకడానికి అమ్మేముందు మీ నాయన మనసును అర్థం చేసుకోలేదెందుకు?"

హరి జవాబు చెప్పకుండానే నా కళ్ళ ఎదరనించి మాయమై పోయాడు. ప్రయత్నించినా ఇంకా నిద్దర రాలేదు. బ్రతికున్న మనుషులే దెయ్యాల్లా ఎదర పడుతున్నా రెందుకో? వీడెవడు? సుకన్య మొగుడు కోమలరావు కదూ?

"పరిస్థితులు అనుకూలించలేదు. లేకపోతే ఆ సపోటా పండు నాది అయ్యేది కదరా! అలాంటి తీపి పండు విలువా రుచీ తెలుసుకోకుండా ఎన్ని హింసలు పెట్టి ఆ సుకన్యను ఎంత వేగిరం శవంగా మార్చేశావురా?"

కోమలరావు ఒక రాక్షసుడిలా రొప్పుకుంటూ పోయాడు. ఎందుకో నా శరీరం ఇంకా ఏదో శక్తి పూనినట్టు వణికిపోతోంది. వీడెవడు? చైనులు!

"చెయినులూ - నివ్వెవరిని కూల్చావో నీకు తెలుసా? ఆ తేనెపట్టులో అసలు ఎవరున్నారో తెలుసుకున్నావా? ఆ రాణీ ఈగ రోజుకు పదిహేనువందల గుడ్లు పెట్ట గలదని తెలుసా? దాని జీవిత కాలంలో పది లక్షల సంతానాన్ని సృష్టించగలదని తెలుసుకున్నావా? విత్తనాలు తినే పక్షులూ, ప్రాణులూ ఈ తేనెటీగలపై ఆధారపడి వున్నాయని తెలీదా? పుప్పొడిని పూల పొత్తికడుపుల్లోనికి జార్చి విత్తనాల సృష్టికి దోహదం చేసేవి ఈ తేనెటీగలని తెలుసుకోలేదా? ఒరే యెయినులూ... మామ్మూలు పదజాలాన్ని తియ్యని కవిత్వంగా మార్చగలిగే శక్తివంతులూ, పూలసౌరభాన్ని తేనెగా మార్చగలిగే సైంటిస్టుల కూడలిని ఒక్కసారి పొగబెట్టించి కాల్చి కూల్చడానికి నీ చేతులెలా వచ్చాయిరా! నీ మూఢ నమ్మకాలతో ఇంత గొప్ప జాతిని హతమార్చే అధికారం నీకెవడిచ్చాడురా?" అరుస్తున్నాను.

తన పనిని సమర్థించుకోడానికి, పంచాంగం పట్టుకొని వస్తున్న చెయినులను వెంట తరమడానికి లేచాను. చెయినులు బదులు ఇంకెవరో చూచాయగా కనిపిస్తూ

ముందు కొచ్చాడు. కాకీ డ్రెస్సు. బొద్దు కట్ మీసాలు. మనిషిని చూడలేదుగాని వీడి ఫోటో ప్రపంచమంతటా పరిచయమైనదే.

"అన్ని లక్షల యూదులను గ్యాసు చాంబర్సులో పెట్టి నిర్దాక్షిణ్యంగా నిలువునా ఎలా చంపగలిగావ్? ఆ నిర్దోషులు నీలాంటి మనుషులేకదా! నీకు వున్న ప్రేమానురాగాలు, ఆశలూ కోరికలూ అన్నీ వాళ్ళకూ వుంటాయని ఎందుకు ఆలోచించలేదు?"

జవాబులేదు. మనిషీ లేడు!

మనిషిని దేముడు సపోటా పండుగా సృష్టించాడు.

హరి, కోమలరావు, చెయినులు, హిట్లర్ – ఇలాంటివాళ్ళే, ఆ సపోటా పండులో చేరిన పురుగులు. ఆ తీపిని తిని, వాటినే పాతమార్చేవాళ్ళు.

*(విశాఖ రేడియో కేంద్ర ప్రసారం – 1989)*
*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 1989)*
*(హిందీ అనువాదాలు: 'సాహితీవృత్త' ఢిల్లీ, 1990)*
*(జాతీయ జ్ఞాన్‌పీఠ్ ఢిల్లీ నా కథల సంపుటిలో*
*'తెలుగుకి శ్రేష్ఠ కహానియా' – మనుప్రకాష్‌వారి కథల సంపుటిలో)*

* * *